ఖాళీ జాగా... వేసేయ్ పాగా..!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పశ్చిమ నియోజకవర్గంలో కబ్జా రాయుళ్లకు రెక్కలొచ్చాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు దానిలో పాగా వేసేస్తున్నారు. ప్రభుత్వ స్థలం అని తెలినా కూటమి నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గుతున్నారని ప్రజానీకం అంటున్నారు. ఫలితంగా ఎస్‌పడీ సెంటర్ పరిసరాల్లోని ఖరీదైన ప్రభుత్వ స్థలాలు క్రమేపీ కనుమరుగైపోతున్నాయి. స్థలాల పరిరక్షణ పేరిట జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ ద్వారా ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డులు సైతం మాయమైపోతున్నాయి.

- కూటమి నేతల కబ్జాల పర్వం
- రాత్రివేళ వెలుస్తున్న రెడీమేడ్ దుకాణాలు
- నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్లు
- ఇదేమి చోద్యం అంటున్న ప్రజానీకం
- విలువైన స్థలాలపై కూటమి నేతల కన్ను
- ఒత్తిళ్లకు తలొగ్గుతున్న అధికార యంత్రాంగం



బీఆర్‌టీఎస్ రోడ్‌లో ఫుట్‌పాత్‌పై వెలిసిన దుకాణం



90వ వార్డు ఆరోవనా డిజిటల్ సెంటర్ వద్ద డ్రైనేజీపై ఏర్పాటు చేసిన దుకాణం

విశాఖ విద్య: విశాఖ నగరంలోని ప్రధాన కూడళ్లలో ఎస్‌పడీ సెంటర్ కూడా ఒకటి. దీనికి సమీపంలోనే ఎయిర్‌పోర్టు ఉంది. ఎస్‌పడీ సెంటర్ చుట్టుపక్కల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన పరిశ్రమలు, కార్యాలయాలు విరివిగా ఉన్నాయి. అటు సింహాచలం, ఇటు మర్రిపాలెం రైల్వే స్టేషన్లకు రాకపోకలు సాగించే వారు కూడా ఎస్‌పడీ సెంటర్ మీదుగానే ప్రయాణం సాగించాలి. దీంతో రహదారులకు ఇరువైపులా ఉన్న దుకాణాలకు గిరాకీ బాగానే ఉంటుంది. దీంతో ఎస్‌పడీ ఫ్లై ఓవర్ చుట్టుపక్కల రహదారులకు అనుకొని ఉన్న ఖాళీ స్థలాలపై కన్నేస్తున్న కూటమి నేతలు, తమ అనుచరులతో దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారు.

ఆక్రమణల్లోనూ హైటెక్ స్కెచ్

కూటమి నేతలు కొంతమంది వ్యూహాత్మకంగా తమ అనుచరులను ఖాళీ స్థలాల్లోకి దింపుతున్నారు. కొన్నాళ్లకు వారితో క్రయ విక్రయాలు సాగిస్తున్నారనే ప్రచారం ఉంది. రాత్రికి రాత్రే కంటైనర్ బడ్డీలను దింపేసి, తెల్లవారే సరికి దానిలో వ్యాపారాలు ప్రారంభించేలా హైటెక్ ఆక్రమణలకు తెరలేపుతున్నారు. ఎస్‌పడీ ఫ్లై ఓవర్ కింద, బుచ్చిరాజుపాలెం డిజిటల్ సెంటర్ పక్కన నెల రోజుల్లో ఇలాంటి దుకాణాలు పదుల సంఖ్యలో వెలిశాయి. అయినా అధికారులకు ఇవేమీ కనిపించకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ఎయిర్‌పోర్టుకు వెళ్లే దారిలో డిఫెన్స్ స్థలంలో వెలిసిన దుకాణం

విద్యుత్ కనెక్షన్లు ఎలా ఇచ్చేస్తున్నారో!

డ్రైనేజీలను ఆక్రమించి పెట్టిన కంటైనర్లలో దుకాణాల నిర్వహణ కోసం విద్యుత్ మీటర్లు కూడా అమర్చుతుండడం గమనార్హం. అనధికారికంగా పెట్టిన ఇలాంటి దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు ఎలా మంజూరు చేస్తున్నారనేది తేలాల్సి ఉంది. డబ్బులు ఇస్తే చాలన్న రీతిలో నిబంధనలకు విరుద్ధంగా పెట్టిన కంటైనర్లకు కూడా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేస్తుండటంతో ఆక్రమణదారులకు ఆయా స్థలాలపై హక్కులు కలిగితే ప్రభుత్వ శాఖల అధికారులే కారకులవుతున్నారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.



52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని గెడ్డ పక్కన స్థలంలో నిర్మించిన పాక

టౌన్‌ప్లానింగ్ విభాగం ఎక్కడ

కాలనీల్లో జీవీఎంసీ లేదా వీఎంఆర్‌డీఏలకు చెందిన స్థలాల పరిరక్షణ బాధ్యతలను చూసే టౌన్‌ప్లానింగ్ విభాగం ఆక్రమణలతో తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తుందనే విమర్శలు ఉన్నాయి. ఆక్రమణలపై ఎవరైనా ఫిర్యాదు చేసినా కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గుతూ, జోనల్ కార్యాలయ అధికారులు అందినకాడికి వెనుకేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వాటిపై ఏదైనా వివాదం చోటుచేసుకుంటే మాత్రం క్షేత్రస్థాయిలో పనిచేసే ప్లానింగ్ సెక్రటరీలను బలిపశువులను చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎస్‌పడీ ఫ్లై ఓవర్, చుట్టుపక్కల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా దృష్టి సారించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



ప్రతిభ చూపిన విద్యార్థులతో అతిథులు

మల్కాపురం: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత కావాలని సెయింట్ ఆన్స్‌కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ నిర్వహించిన సదస్సులో మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల నుంచి జాతీయ సేవా పథకం అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు. సదస్సులో వలంటరీలు పర్యావరణ పరిరక్షణపై అద్భుతంగా ప్రసంగించడంతో పాటు,పర్యావరణానికి హాని కలిగించే వస్తువుల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. దీంతో వీరు చూపిన ప్రతిభకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు.

కేజీహెచ్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం

అల్లిపురం: కేజీహెచ్‌లో ప్రజల సౌకర్యార్థం రూ. 23 లక్షలతో నిర్మించిన నూతన ఫార్మసీ కౌంటర్, టెస్లా సెంటర్ వద్ద రోగుల కోసం నిరీక్షణ షెడ్లు, అలాగే మార్చురీ ఆవరణలో నిర్మించిన పోలీస్ అవుట్ పోస్ట్‌ను ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీస్ అవుట్ పోస్ట్ భవనం లేకపోవడం వలన గతంలో ప్రజలు, పోలీస్ సిబ్బంది చాలా ఇబ్బంది పడేవారన్నారు. కేజీహెచ్ పరిసరాల్లో ఐదు కిలోమీటర్ల పరిధిలో 24/7 డ్రోన్ల నిఘా ఉంటుందన్నారు.

క్లుప్తంగా

నేడు యాదవ సంఘ సమావేశం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన విజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. సంఘ సభ్యుల సంక్షేమం, ఆగస్టులో నిర్వహించనున్న కృష్ణాష్టమి వేడుకులకు సంబంధించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు.మల్కాపురం యాదవ సంఘంలో సభ్యులుగా ఉన్న ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.

బెస్ట్ సింగర్ ఆఫ్ ది ఇయర్‌గా అల్మా బెరెక



మల్కాపురం: ఆన్ సింగ్ హోరోన్ అండ్ బెస్ట్ సింగర్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానికంగా నిర్వహించిన బెస్ట్ సింగర్ ఆఫ్ ఇయర్ పాటల పోటీల్లో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన అల్మా బెరెక బెస్ట్ సింగర్ ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డు సొంతం చేసుకున్నారు. అవార్డును నగర పోలీస్ కమిషన్ శంకబత్ర బాగ్చి చేతల మీదుగా ఆమె అందుకున్నారు. అల్మా చెరెక ఇప్పటి వరకు పలు అవార్డులు సాధించారు. బెస్ట్ ఫ్యాషన్ అచీవర్ -2025,బెస్ట్ ర్యాంప్ వాక్ ఇన్ మిస్సెస్ ఇండియా-2024(రన్నర్ అప్)వంటి అవార్డులు ఆమె సాధించారు.తాజాగా మరో అవార్డు సాధించడంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు సింగర్స్ ఆమెను అభినందించారు.

మజ్జిగ పంపిణీ



వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న యువకులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు.స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏదుర నర్సింగ్‌యాదవ్ కుటుంబ సభ్యులు చేపట్టిన కార్యక్రమాన్ని పుర్రె సురేష్‌యాదవ్ ప్రారంభించారు. వాహనదారులు,పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని.. ఇలాంటి సమయంలో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దాకరపు రాజుయాదవ్, నక్కవానిపాలెం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు



కారులో సామగ్రిని పరిశీలిస్తున్న సీఐ గొలగాని అప్పారావు

మల్కాపురం: నాకాబందీ కార్యక్రమంలో భాగంగా మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముఖ్య కూడళ్లలో మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. కోరమాండల్ గేటు వద్ద జరిగిన కార్యక్రమంలో సీఐ గొలగాని అప్పారావు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ నగరానికి రానున్న తరుణంలో నాకాబందీ చేపట్టడం జరగుతుందన్నారు. వాహనాల పత్రాలు పరిశీలించామని, అనుమానితులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మల్కాపురం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వాహనాల్లో ప్రయాణించే వారు సంబంధిత పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

రైల్వే న్యూ కాలనీలో కార్డన్ సెర్చ్



వాహనాలు, ఇళ్లు తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతంపేట: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వే న్యూకాలనీ ప్రాంతంలో శనివారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈస్ట్ సబ్ డివిజన్ సిబ్బంది సాయంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొని తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వాహనాలు, వ్యక్తులను, ఇళ్లను అణువణువూ పరిశీలించారు. దుకాణాల్లో నిషేధిత వస్తువులు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. అనుమానిత వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

సింహాచలేశునికి స్వర్ణ తులసీ దళార్చన



స్వర్ణతులసీ దళాలతో స్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఉదయం 7గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



ఈగిల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ మల్లికార్జునరావు, యువత

పరవాడ: మాదకద్రవ్యాల వినియోగం ద్వారా శారీరక, మానసిక సమస్యలతో పాటు నేర ప్రవర్తనలు సమాజ పతనానికి దారి తీస్తాయని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దేశపాత్రునిపాలెంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వహించారు. టోర్నమెంట్‌లో స్థానిక యువత ఉత్సహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వ్యసనంగా మారితే ఆ కుటుంబం చిన్నాభిన్నమవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరాను అరికట్టేందుకు ప్రజల సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈగిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పిళ్లా శివకృష్ణ, ఏవీ రామారావు, లక్కరాజు శ్రీనివాస్, శనివాడ ప్రకాష్, ఎస్.జనార్ధన్‌రావు, పి.రమేష్, ఈగిల్ కానిస్టేబుల్ ఎస్.కేశవరావు పాల్గొన్నారు.

బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి అభినందనీయం




వర్క్‌షాపులో పాల్గొన్న బాలికలతో అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, ఎన్టీపీసీ ఉన్నతాధికారులు సంగీత కౌశిక్, సమీర్‌శర్మ

అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్

పరవాడ: బాలికా సాధికారతకు సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం తీసుకున్న చొరవ అభినందనీయమని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. ఈ విభాగం ఆధ్వర్యంలో గత నెల 9న ప్రారంభమైన బాలికా సాధికారత మిషన్-2025 వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు విద్య నేర్పించడం ఎంత అవసరమో వివరించారు. బాలికల వ్యక్తిత్వంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్టీపీసీ కార్పొరేట్ ప్లానింగ్ ఈడీ సంగీత కౌశిక్ మాట్లాడుతూ బాలికల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్న సంస్థ చొరవను కొనియాడారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ మాట్లాడుతూ గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ ద్వారా బాల బాలికలకు యోగా, కరాటే, కంప్యూటర్, నృత్యం, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసం, చిత్రలేఖనం తదితర అంశాల్లో నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించామన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న 120 మంది బాలికలకు అవసరమైన సదుపాయాలను కల్పించడం కోసం సంస్థ రూ.50 లక్షలను వెచ్చించిందన్నారు. ఈ మిషన్‌లో బాలికలకు మార్గదర్శకాలను అందించిన ఉద్యోగులను ఈడీ అభినందించారు. కార్యక్రమంలో బాలికల నృత్యాలు, ఆపరేషన్ సిందూర్, యోగా, కరాటే వంటి ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



స్టీల్‌ప్లాంట్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు, సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్టీల్‌ప్లాంట్ కేప్టివ్ పవర్ ప్లాంట్‌కు చెందిన పంప్ హౌస్-2 సమీపంలో మొక్కలు నాటారు. వాటర్ మేనేజ్‌మెంట్ విభాగం అధికారులు చంద్ర భూషణ ప్రసాద్, బి. బైజు, కె. రవిచంద్, ఎస్. భరత్‌కుమార్, బి.పి. శ్రీకాంత్ కళ్యాణ్, సీపీపీ-2 అధికారి విష్ణుమూర్తి, డి. శ్రీనివాసరావు చేతుల మీదుగా మామిడి, మూడు వేప, ఐదు నేరేడు, మూడు రావి, మూడు జామ, మూడు సపోటా వంటి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు పర్యావరణ పరిరక్షణకు సత్యసాయి సమితి చేస్తున్న కృషిని అభినందించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

పిల్లల్లో స్వతంత్ర ఆలోచనలు ముఖ్యం

- ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్

సీతంపేట: జీతం కోసమే కాకుండా జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా పిల్లలను తయారు చేయాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర రవి కిరణ్ అన్నారు. బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం హైవే సమీపంలోని కస్టమ్స్ జీఎస్టీ నార్కోటిక్స్ జాతీయ అకాడమీ(నాసిన్)లో శనివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ప్రశ్నించే తత్వం పెరగాలని, నేటి ఏఐ కాలంలో బట్టీ పట్టే చదువులకు చోటు లేదన్నారు. పిల్లల్లో స్వతంత్రంగా ఆలోచించే మనస్తత్వం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. రోజూ పిల్లలు కొద్దిసేపు అయినా ఆంగ్ల దినపత్రికలు చదవాలని సూచించారు. ఇష్టమైన హాబీల్లో పిల్లలను ప్రోత్సహిస్తే వారు మత్తు పదార్థాలు, ఇతర వ్యసనాల వైపునకు మళ్లకుండా ఉంటారన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ విషయంలో ప్రాధాన్యమివ్వాలన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు.

కనకమహాలక్ష్మికి తులసిపూజ



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు భక్తులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి నిర్వహించిన త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయ దాతలు భాగమ య్యారు. ప్రతి శనివారం నిర్వహించే తులసిపూజలో పాల్గొనే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ. 1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఏఈవో తిరుమలేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎండ.. వాన..





ఉదయం ఎండ.. సాయంత్రం వర్షంతో గోపాలపట్నంలో శనివారం భిన్న వాతావరణం కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడి, ఉక్కపోతతో స్థానికులు సతమతమయ్యారు. సాయంత్రం 4 గంటల సమయంలో కాస్తా వర్షం పడడంతో ఉపశమనం పొందారు. నాలుగైదు రోజులుగా ఉక్కపోత వల్ల ఇబ్బందులు పడుతున్న గోపాలపట్నం వాసులు ఈ వర్షం సేద తీర్చిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – గోపాలపట్నం

ముగిసిన శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం విశేష పూజలతో ముగిశాయి. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు దివ్యక్షేత్రం చైర్మన్ గుత్తికొండ బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు శ్రీవారు పెదశేష వాహన సేవ, గరుడు వాహన సేవ, సూర్య ప్రభ వాహన సేవ, ముత్యాల పందిరి వాహన సేవలో విహరించారు. అనంతరం శ్రీవారి ద్వితీయ వార్షిక కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆఖరిరోజు శనివారం శ్రీవారికి సుప్రభాత సేవ, అర్చన, భక్తులకు శ్రీవారి దర్శనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, స్వామివారి మూల మంత్ర హోమం, మహాపూర్ణాహుతి, బలిహరణ, వసంతోత్సవం, శ్రీవారి స్నపన తిరుమంజనం, శ్రీవారి చక్రస్నానం, నీరాజనం వంటి పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.



శ్రీవారి చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ

అల్లిపురం: ఏడాది గడుస్తున్నా అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు కూటమి ప్రభుత్వం పరిష్కరించాలేదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సుబ్బారావమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోమవారం దేశవ్యాప్తంగా జరిగే అఖిలభారత సమ్మెలో అంగన్‌వాడీ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జగదాంబ వద్ద సీఐటీయూ యూనియన్ కార్యాలయంలో శనివారం జరిగిన అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో 42 రోజుల సమ్మె సందర్భంగా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను ఆమె గుర్తు చేశారు. సమ్మె కాలంలో కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అర్బన్ ప్రాజెక్టు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా ఆర్. ఈశ్వరమ్మ, అధ్యక్షురాలిగా శోభారాణి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. తులసి, కోశాధికారిగా ఇందిర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నపూర్ణ, ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీలుగా ఎర్రయమ్మ, పార్వతి ఎన్నికయ్యారు. శివలక్ష్మి, రాధ, నజ్మా, వల్లి రాణి, పైడికొండ, కుమారి, మహాలక్ష్మిలను సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, బృందా, వెంకటలక్ష్మి, పద్మ, పి. మణి తదితరులు పాల్గొన్నారు.